
కథ

# సుందరం కసి తీరలేదు

చిలుకూరి దేవపుత్ర



"ఛీ..ఛీ పొద్దున్నే ఎవడి మొహం చూసినానో... దరిద్రంగా వుంది.... మంచి రోజు చూసుకొని, రాహుకాలం దాటినాక జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా ఇదేంది ఇట్లయింది... పొద్దున్న బయల్దేరేటప్పుడు సీతని ఎదురు రమ్మన్నాను...అది కూడా నవ్వు మొగంతోనే ఎదురొచ్చింది... మరెక్కడ జరిగింది లోపం...సీత ఎదురొస్తే ప్రతి విషయంలోనూ ఇంతవరకూ విజయమే వరించింది" అంటూ మనసులోనే గొణుక్కుంటున్నాడు సుందరం.

బస్సులో కళ్యాణదుర్గం నించి తిరిగి వస్తున్నాడ తను. ఆత్మకూరులో బస్సాగింది. తన పక్కసీటులో కూచున్న ప్రయాణీకుడు దిగిపోయాడు. రెండు సీట్లూ తనే ఆక్రమించుకున్నాడు సుందరం.

ఇంతలో మరో ప్రయాణీకుడు వెనుక సీట్లోంచి వచ్చి, సుందరం పక్కసీట్లో కూచోవాలనుకుని, సర్దు కోమని చేత్తోసైగ చేశాడు. అసలే విసుగుతో రగిలిపో తున్న సుందరానికి అతని సైగ చూసి ఎగిచ్చి తందామా అన్నంత ఊపు వచ్చేసింది. అవతలి మనిషి తనకంటే బలవంతుడని తన బుద్ధి మేల్కొని 'ఒక్క తన్ను నువ్వు తంతే వాడు నీ ఎముకలన్నీ ఒక్కటి మిగలకుండా మొత్తం విరగ్గొట్టేయగలడు' అంటూ తెలియబరిచి, అతని అసహనాన్ని చంపే సింది. కళ్లతోనే ఆ బలవంతుడి వైపు చురచుర చూసి జరిగాడు సుందరం. ఆ ప్రయాణీకుడు సుందరం కళ్లతో ఏమాత్రం పనిలేనట్లు చూడకుండా అతని చేష్ట తోనే పని వున్నట్లు ఖాళీ అయిన సీటులో నింపాదిగా కూర్చున్నాడు.

సుందరం కసిని పట్టించుకోకుండా బస్సు కది లింది. ఎవర్ని తందామా.. ఎక్కడ తందామా...అ న్నట్లు కసీ, కోపం, విసుగూ అతన్ని నిలువునా ఆవ హించి వున్నాయి.

ఉదయం నుంచీ ప్రశాంతంగా వున్న తన మనో తటాకంలో పెద్ద బండరాయిని విసిరిన దుర్మార్గుడు ఎమ్మార్వో నరసింహుడు, వాడు, నిజంగానే నరసింహుడు. తను రెవెన్యూ ఇన్స్‌పెక్టరుగా జాయి నింగ్ రిపోర్టు ఇచ్చి, ఐదు గంటలన్నా అవలేదు. అప్పుడే...ఛీ..ఛీ..అనుకోబుద్ధి కూడా కావడంలేదు. అలా అనుకుంటూనే కిటికీలోంచి చూశాడు. చీకట్లో దెయ్యంలా చెట్లు ఎక్కడికో పరిగెడుతున్నాయి. దూరంగా కొరివి దెయ్యాల గుంపులా ఏదో ఊరిలో దీపాలు మిణుకుమిణుకుమంటున్నాయి.

ఆ వేళ జరిగింది అంతా కళ్లముందు కదలసాగింది సుందరానికి.

ఆ రోజు ఉదయం పదింటికల్లా కళ్యాణదుర్గం ఎమ్మార్వో ఆఫీసు చేరుకున్నాడు సుందరం. అప్పటి కింకా ఎమ్మార్వో రాలేదు కానీ దాదాపు స్టాఫంతా వచ్చేసినారు. తన ఏడేళ్ల సర్వీసులో అక్కడున్న వాళ్లందరూ పరిచయమే. అందరూ అతన్ని సాద రంగా మాట్లాడించారు. హెడ్ గుమస్తా టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చున్నాడు సుందరం.

''ఏమప్పా... సుందరం... జాయినింగ్ రిపోర్టు రా సుకొని వచ్చినావా? ఎమ్మార్వో పదిన్నర పైనే ఆఫీసు కొచ్చేది'' అంటూ తను అడిగిన ప్రశ్నకు సమాధా నాన్ని ఆశించకుండా అడగని ప్రశ్నకు సమాధానం కూడా ఇచ్చాడు హెడ్‌గుమస్తా.

"పదిన్నర వరకూ రాహుకాలం కదా సార్! అది దాటాకే జాయినింగ్ రిపోర్టు రాస్తా'' అన్నాడు సుందరం వినయంగా. సార్! ఎమ్మార్వో ఫర్వాలేదా? ''అని అడిగాడు సుందరం. ఆ మాట అడుగుతు న్నాడు అంటే ఎవరి గురించి ఏమీ తెలీకుండానే అతను ఆ ఆఫీసులో అడుగుపెట్టాడని ఎవరయినా అనుకుంటే తప్పకుండా తప్పులో కాలే! ఒక్క ఎమ్మార్వో విషయమే కాదు ఆ ఆఫీసులో అటెండరు మొదలుకుని అన్ని రకాల కేడర్ల వాళ్లు ఎట్లాంటి స్వభావం ఉన్నవాళ్లో, ఎవరెవర్ని ఎంతలో ఉంచాలో అన్నీ కలెక్టరాఫీసులో దాదాపు పాతిక, ముప్ఫయి మంది వద్ద ఎంక్వయిరీలూ, అవీ చేసుకొని మరీ వచ్చాడతను. అయినా ఎవరో చెప్పేది వేరు. హెడ్ గుమస్తా చెప్పేది వేరు. ఒక మనిషి గురించి పక్కింటి వాళ్లనడగడానికీ, అతని పెళ్లాన్ని అడగడానికి తేడా వుంటుందని విశ్వసిస్తాడు సుందరం.

హెడ్‌గుమస్తా పళ్లన్నీ కనిపించేలా కళ్లు రెండూ చిన్నవి చేసి శబ్దం లేకుండా ఒక నవ్వుని వెలిగించి... ''ఫర్వా వుంది అంటే జాయిన్ కాకుండా వెళ్లిపోతావే మప్పా! అంటూ కళ్లజోడు మీద నించీ తల కాస్త వంచి సుందరం కళ్లలోకి చూస్తూ, తినబోతూ రుచులెందుకు సుందరం! మరి కాసేపట్లో ఎట్లా ఆయనే వస్తారు చూడు'' అన్నాడు. ఆ మాటకు వెర్రి నవ్వుని అభినయించి, తనకే బాగా అనిపించక మానుకున్నాడు సుందరం.

''ఒక్కమాట చెప్తా సుందరం! నువ్వే అర్థం చేసుకో. అతని పేరు నరసింహుడు. కానీ నర సింహుడే. అయితే ఆయనలో ఒక సుగుణం వుంది. స్టాఫ్ కడుపు మీద కొట్టడు. ఎన్ని మాటలన్నా అంటాడు. ఎంతయినా నీచపరుస్తాడు. మనం ఎంత పెద్దతప్పు చేసినా పై అధికారులకి నీ మీద కంప్ల యింట్ చేయడు. అదీ అక్కడ ఆయన్ని మెచ్చుకోవ ల్సిన విషయం'' అన్నాడు హెడ్డు.

రాహుకాలం పూర్తిగా తొలిగిపోయిందన్న నమ్మకం కుదిరాక గోడ గడియారం వేపు ఒకసారి చూసి, హెడ్ గుమస్తాతో పావు ఠావు కాగితాన్ని ఇప్పించుకొని జాయినింగు రిపోర్టు రాశాడు సుందరం.

పదీ నలభై అవుతున్నట్టే గేటు వద్దనుంచీ జీపు హారన్ వినిపించింది.

''వచ్చే వచ్చే - ఎమ్మార్వో వచ్చే'' అన్నాడు అటెండరు నాగన్న.

'పిల్లి వచ్చే ఎలుక భద్రం' అన్నట్టు అందరూ మాటలు మరిచిన మనుషుల్లా అత్యంత శ్రద్ధగా ఫైళ్లు రాసుకుంటున్నారు.

ఎమ్మార్వో తన ఛేంబర్‌లోకి పోయి కూచున్నాడు. కాసేపటికి లోపల్నించి ఎమ్మార్వో అరుపులు విని పిస్తున్నాయి. ఎవరి మీదనో ఎగిరిపడుతున్నాడు.

''ఎట్లసార్! జాయినింగ్ రిపోర్టు ఇద్దామనుకుంటే ఆయన హాట్ హాట్‌గా వున్నాడే!'' అన్నాడు సుందరం హెడ్డుగుమస్తాతో.

''మరి ఆయన కూల్ కూల్‌గా వుండేటప్పుడు ఇస్తావా? అట్లయితే ఈ జన్మకి వీలుపడదు. ఇయ్యి పోవయ్యా- ఏంజేస్తాడు కొరుక్కుతింటాడా?'' అన్నా డు హెడ్ గుమస్తా.

''మీరు పోయి ఆయన్ని విష్ చేయరా?'' అన్నాడు సుందరం.

''ఊహూ! ఆయన పిలిస్తే కానీ ఎవరూ పోకూ డదు. అట్లా ఊరకనే పోయి విష్ చేసినామంటే ''ఏం వేరే ఏం పనిలేదా?'' అంటూ బూతులు తిడతాడు అన్నాడు హెడ్ గుమస్తా.

ఇవన్నీ వింటున్న కొద్దీ సుందరానికి కాళ్లల్లో వణుకు, గుండెల్లో దడ మొదలైంది.

'ఏం చేద్దాం. పోయి నాలుగు తిట్టించుకుందాం. తప్పుతుందా?' అనుకుంటూ ఎమ్మార్వో ఛాంబర్ లోకి ప్రవేశించాడు సుందరం.

''నమస్తే సార్!'' అన్నాడు

ప్రతి నమస్కారం చేయకుండానే 'ఏం' అన్నట్టు తల ఎగరేశాడు ఎమ్మార్వో.

జాయినింగ్ రిపోర్టు ఎమ్మార్వోకి అందిస్తూ, విష యమంతా టూకీగా చెప్పేశాడు సుందరం.

''ఊ...సరే- ఇదిగో చూడూ- నువ్వు ఫ్యామిలిని యాడన్నా పెట్టుకో నాకు అవసరం లేదు. నాకు నువ్వు అందుబాటులో ఉండల్ల తెల్సిందా?'' అంటూ గర్జిస్తున్నట్లు మాట్లాడి, జాయినింగ్ రిపోర్టు మార్జి న్‌లో 'అడ్మిటెడ్' అని రాసి సుందరానికి ఇచ్చేశాడు. దాన్ని హెడ్ గుమస్తాకు ఇచ్చేందుకు అక్కడి నుంచి వేగంగా కదిలాడు సుందరం.

సాయంత్రం నాలుగ్గంటలు అవుతున్నట్టే ఎమ్మార్వో తిరిగి ఆఫీస్ ఛాంబర్‌లోకి వచ్చాడు.

అటెండరు నాగన్న వచ్చి ''ఆరై సారూ! ఎమ్మార్వో సారు'' అన్నాడు పిలుస్తున్నాడన్న అర్థంలో.

హెడ్ గుమస్తా ముందు కూచుని వున్న సుందరం టక్కున లేచి వెళ్లాడు.

అతనింకా లోపలకి అడుగుపెడుతున్నట్టే...

''ఏమండీ ఈ ఆరై ఎక్కడండీ... ఎవరో ఉడతలు పట్టేవాడిలాగా వున్నాడు. పిలవగానే రాలేడా!'' అంటున్నాడు నాగన్నతో, నాగన్న ఏదో చెప్పాలని చూస్తున్నా వినిపించుకోకుండా-సిగరెట్ పొగ గాలి లోకి ఊదేస్తూ..

తను ఉడతలు పట్టేవాడిలా వున్నాడా? వాటే షేమ్! - ఆ మాటలకు షాక్ తిన్నవాడయి...లోప





నీకు ఆరై కోర్సు కొత్త కావచ్చుకానీ రెవిన్యూ కొత్త కాదుగా. మన ఆఫీసులో హెడ్ గుమస్తా వుండాడు. వాడినడిగితే నా గురించి ఏ టూ జెడ్ చెబుతాడు. ఇప్పుడు నాకు సిగరెట్లు అయిపోయినాయి. నేను ఆఫీసులో ఉన్నప్పుడు ఏమేమి అవసరమో, క్యాంపుకు వెళ్లినప్పుడు ఏమేం అవసరమో వెంటనే అడిగి తెల్సుకో పో.. కామన్ సెన్సు లేని వాళ్లందర్నీ ఈ కలెక్టరాఫీసు వాళ్లు ఇక్కడకి పోస్టు చేస్తారు

ల్నించీ తన్నుకు వస్తున్న కోపాన్ని, రోషాన్ని అణిచిపెట్టుకుని – 'సార్' అన్నాడు దగ్గరగా పోయి.

"ఏం ఆరైవయ్యా నువ్వు నీటుగా టక్ చేసుకొని కళ్లకి అద్దాలు పెట్టుకొని, కాళ్లకి బ్లాక్ షూ వేసుకుంటే సరిపోదండీ, కాసింత కామన్ సెన్స్ ఉండల్ల. ఆరై అన్న వాడికి – అరే ఎమ్మార్వో ఆఫీసులోనే వున్నాడు, వాడు ఎట్లాంటివాడు, ఏం అలవాట్లు ఉన్నాయి? ఏం తింటాడు? ఏం తాగుతాడు? అనేదే లేదేమయ్యా" అన్నాడు సీరియస్‌గా సుందరాన్నే చూస్తూ....

"సార్ నేనింకా.." అంటూ సుందరం ఏదో చెప్పబోతే –

"... చేరి ఐదు గంటలన్నా కాలేదు అని అనబోతావ్. నాకు తెలుసు. ఆరైగా చేరేవానికి కొత్తేముందీ? నీకు ఆరై కోర్సు కొత్త కావచ్చు కానీ రెవిన్యూ కొత్త కాదుగా. మన ఆఫీసులో హెడ్ గుమస్తా వుండాడు. వాడినడిగితే నా గురించి ఏ టూ జెడ్ చెబుతాడు. ఇప్పుడు నాకు సిగరెట్లు అయిపోయినాయి. నేను ఆఫీసులో ఉన్నప్పుడు ఏమేమి అవసరమో, క్యాంపుకు వెళ్లినప్పుడు ఏమేం అవసరమో వెంటనే అడిగి తెల్సుకో పో.. కామన్ సెన్సు లేని వాళ్లందర్నీ ఈ కలెక్టరాఫీసు వాళ్లు ఇక్కడకి పోస్టు చేస్తారు" అంటూ తిట్ల దండకం కొనసాగుతూ వుంది.

సుందరం బయటకొచ్చేశాడు. నాగన్నకి ఓ యాభై నోటిచ్చి కాఫీలూ, సిగరెట్లు తెప్పించమన్నాడు. చేరిన రోజే తను అట్లా తిట్టించుకోవడం మింగుడు పడడంలేదు అతనికి. ఆఫీసులో స్టాఫ్ అంతా విని వుంటారన్నది అతన్ని మరింత కలవర పెట్టిన విషయం.

అనంతపురం వచ్చేసింది. గతంలోంచి ఊడిపడ్డాడు సుందరం. బస్టాండులోని వాహనాల స్టాండులో వుంచిన తన మోపెడ్‌లో ఇంటికి చేరుకున్నాడు.

మూసి వున్న తలుపులు తెరుచుకొని ఇంట్లోకి అడుగుపెట్టి బట్టలు మార్చుకున్నాక సీత అప్పుడొచ్చింది. ఇంటికి మొగుడు ఎప్పుడొస్తాడోనన్న దిగుల్లేదు ఈ మనిషికి. మొగుడు రాగానే ఇంత కాఫీ మొగాన పోద్దాము అన్న ఇంగితం లేదు. ఛ...ఛ.. అంటూ గొణుగుతూనే బాత్‌రూంలో దూరి మొహం కడుక్కువచ్చాడు. టవల్‌తో మొహానికున్న తడిని వత్తుకుంటూ వుంటే–

"ఎప్పుడొస్తివీ?" అంటూ నవ్వుతూ వచ్చింది సీత.

సమాధానం ఇవ్వాలనిపించలేదు అతనికి. ఆమె నవ్వుతో భగభగ మండి రెండు తన్నులు తందామా అనిపించిందతనికి. అయితే అతని బుద్ధి వారించింది.

అసలూ, ఈ ఆడవాళ్లు చేసుకున్న అదృష్టమేందీ... హాయిగా ఇంట్లో వుండీ, తీరిగ్గా వంటచేసుకుంటూ, అంట్లు తోముకుంటూ బట్టలు వుతుక్కుంటూ వుంటారు. పైగా వాళ్లపై పెత్తనం చేసే అధికారి ఎవ్వరూ వుండరు. అందుకే నవ్వుతారు. నవ్వకేం చేస్తారు?

'ఎప్పుడొస్తివీ? ఏం పెయిలో బాగాలేదా? జాయినింగ్ రిపోర్టు ఇచ్చినావా? ఆఫీసులో బాగుందా?' అంటూ ప్రశ్నల వర్షాన్ని కురిపిస్తోంది సీత అమాయకంగా.

"ఊc చానా బాగుంది!" అన్నాడు కరుగ్గా ఆమెని చూడకుండానే.

సుందరం వాలకాన్ని చూసి, సీత మూతి తిప్పి వంటిట్లోకి వెళ్లిపోయింది.

ఫ్లాస్క్‌లో పోసిపెట్టిన కాఫీ పెద్ద స్టీలు గ్లాసు నిండా పోసుకొని వచ్చి ఇచ్చింది.

పేపరు ముందేసుకొని చదువుతూన్నట్లు ఫోజు పెట్టి కాఫీ తాగుతున్నాడు ఈజీ ఛైర్‌లో కూచూని.

కాఫీలో చక్కెర లేదన్న విషయం మూడో గుక్కకు కాని తెలిసిరాలేదు. "ఏందిది? కాఫీనా? కాలకూట విషమా?" అన్నాడు చుర చుర చూస్తూ...

"ఏందీ! చెక్కర వేయ్యలేదా? అయ్యో! ఎంతపనయ్యింది? ఇట్ల ఇయ్యి చెక్కెర ఏసుకొని వస్తా!" అంది సీత ఆందోళన పడిపోతూ.

"ఇంత విషం కలుపుకొనిరా! పీడ విరగడవుతుంది" విసుగ్గా మొహం పెట్టి.

"అవేం మాటలూ? ఏమో అయ్యింది ఈయనకి" అంటూ కాఫీ గ్లాసు తీసుకుపోయి చెక్కెర కలుపుకొని వచ్చిందామె. చెక్కెర సాకుతో మరో రెండుసార్లు తందామన్న ఊహను అదుపుచేసుకున్నాడు సుందరం. కాఫీ తాగేశాడు. తృప్తి లేదు. చల్లగా అయిపోయింది.

ఎవర్నన్నా తందామా అనిపిస్తూ వుంటుంది మాటి మాటికీ....

పేపరు చదువుతున్నట్లు నటిస్తున్నాడు. సీత కొద్ది దూరంలో వున్న కుర్చీలో కూచుని మొగుణ్నే గమనిస్తోంది. ఓర గంట తనూ ఆమెని గమనించకపోలేదు.

"పిల్లలిద్దరికీ స్కూలు ఫీజు కట్టల్లంట" అంది సీత.

వినిపించుకోనట్లు వున్నాడతను. మరో రెండు గంటల పాటు ప్రశాంతంగా వుంటే గానీ తన మనసు కుదుటపడేలా లేదు.

ఇంటిబాడుగ పెంచుతారంట. నూరు రూపాయలు" అంది మళ్లీ.

గమ్మున వుండిపోయాడు. ఆ మాత్రం అర్థం చేసుకోలేదూ ఈ ఆడది...అతని కోపం నషాలానికి ఎక్కుతూ వుంది.

"కరెంటు బిల్లు కట్టేకి ఈ నెల 16వ తేదీనేనండి లాస్ట్‌డేటూ" అంది సీత కదలికల్లేని మొగుణ్ని చూస్తూ.

"ఇదో కాసేపు నన్ను ప్రశాంతంగా ఉండనియ్యివా? వూరికే అట్ల చెవికోసిన మేక మాదిరి అరుస్తావుంటావా?" విసుగుతో ఉరిమాడతను.

"ఏంది అట్ల అరుస్తావ్! వున్న విషయాలు చెప్తాంటే... చెవుకోసిన మేకమాదిరీ, తోక్కోసిన కుక్క మాదిరి అరుస్తున్నట్లు కనిపిస్తానా?" అంటూ ఒంటికాలిమీద లేచిందామె.

దీన్ని ఒక తన్ను ఎగిచ్చి తంతేనో అమ్మో–వారం కిందట అట్ల తన్నినందుకు రెండు గంటలు ఏడిచింది. చుట్టుపక్కల వాళ్లు తనని ఏమనుకుంటారోనని కాళ్లావేళ్లా పడ్డాడు. అయినా దిగిరాలేదు. మూడురోజులు ముడుచుకొని పడుకుంది. తనే పిల్లలకి వండి వార్చి ఆఫీసుకి పోయేటప్పటికి నడుములులిరిగిపోయాయి. అదంతా క్షణంలో గుర్తుకొచ్చి తన కోపాన్ని వినయంలోకి అనువదించి "అరెరే సీతేనా – అట్ల అరుస్తా వుండేది. నీతో సరదాకి అట్ల అన్నానంతే. అసలేం జరిగిందంటే మా ఆఫీసరుగాడు నా మూడ్‌ని పాడు చేసినాడులేవే" అన్నాడు మెత్తగా సుందరం.

"అంతే వాడెవడో ఆఫీసరు నీ మూడ్‌ని పాడు చేస్తాడు. వాని మింద కేకలు వెయ్యలేవు. ఇక్కడ ఇంటికొచ్చినాక, నీకు అరవకి చిక్కింది నేనూ, పిల్లలే కదా. అరసండి, కరసండి, తన్నండి, పొడవండి... ఏం జేసినా మేమేం మాట్లాడలేం కదా? అంది సీత. విసురుగానే ముడిచిన కనుబొమ్మలలో చూస్తూ బయట నుంచి పిల్లలు వస్తున్నట్లు మాటలు వినిపించాయి. అమ్మయ్య వీళ్ల సమయానికి వచ్చినారు అనుకుంటూ "పిల్లలొస్తున్నారు వూరుకో" అన్నాడు లోగొంతుకతో సుందరం.

"నాన్నా! వాడు నీ పెన్ను పొద్దున తీసుకున్నాడు కదా – నువ్వు వద్దన్నా!అప్పుడే పోగొట్టేసినాడు" అంటూ పెద్దోడు రాజేష్ చెప్పాడు. వాడికి పదేండ్లు వుంటాయి. వాడి కన్నా చిన్నోడు మహేష్‌కు ఎనిమిదేళ్లుంటాయి. బిత్తర చూపులు చూస్తూ ఇంట్లోకి అడుగుపెడుతున్నాడు మహేష్.

అందాకా సీత గొంతు పెంచకపోయి వుంటే పెన్ను పోగొట్టిన మహానేరానికి రెండు తన్నుల్ని శిక్షా స్మృతి కింద పొందే అవకాశం కలిగి, సుందరానికి అప్పుడు కొంత రిలీఫ్ లభించి వుండేది. అయితే అక్కడా తను ఫెయిల్యూర్ అయిపోయాడు.

"ఇట్లరారా...తన్నను గానీ రా...దగ్గరకి రా!" అంటూ పిలిచాడు తండ్రి.

"తంతావా?" అనడిగాడు తనయుడు, తండ్రి మాటల్లోని అంతరార్థం గ్రహించినట్టు.

"ఊహూ ముద్దు పెట్టుకుంటాను రా" అంటూ నమ్మపలికాడు తండ్రి. అధమం వాడిని చెవి పిండి తన కోపాన్ని తీర్చుకోవాలన్న కోరిక బలంగా ఉన్నది అతనికి.

'నీ కథ నాకు తెలీదా నాన్నా! నీ మోసకారి వేసికాలు ఎన్నిసార్లు చూడలేదు అన్నట్లు మొహం పెట్టి...వాళ్లమ్మ చాటుకి పరుగెత్తి దాక్కున్నాడు మహేష్.

తన మోసకారి తనాన్ని ఇట్టే పసికట్టేసిన కొడుకు తెలివితేటలకి నవ్వు వచ్చింది. కసికసిగా నవ్వాడు. "హా...హా...హా..." అంటూ. ఆ నవ్వుని చూసి పిల్లలిద్దరూ జడుసుకున్నారు.

సీత మాత్రం ముడిచిన కనుబొమ్మలతో చూస్తూనే వుంది సుందరాన్ని.

★